పంచాయతీ ఏర్పాటుపై హామీ



స్పీకర్‌కు వినతిపత్రం ఇస్తున్న గ్రామస్తులు

శంషాబాద్ రూరల్: మండలంలోని బోటిగూడ పంచాయతీ ఏర్పాటుపై అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్‌కుమార్ హామీ ఇచ్చినట్లు గ్రామస్తులు తెలిపారు. ఈమేరకు స్పీకర్‌కు శుక్రవారం వినతిపత్రం అందించారు. రామంజాపూర్ పంచాయతీ నుంచి దూరంగా ఉన్న బోటిగూడలో అభివృద్ధి పనులు జరగట్లేదని చెప్పారు. స్పీకర్‌ని కలిసిన వారిలో కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల నియోజకవర్గం ఇన్‌చార్జి భీం భరత్, భిక్షపతి, సురేశ్, నర్సింహయాదవ్, యాదగిరి గౌడ్, శంకర్, శ్రీశైలం, బాల్‌రాజ్, పాండు, స్వామి తదితరులున్నారు.

సమస్యలపై వినతిపత్రం



కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

మణికొండ: అలకాపూర్‌లో ఉన్న ప్రధాన సమస్యలను వెంటనే పరిష్కరించాలని సంక్షేమ సంఘం అ ధ్యక్షుడు వంశీ ఆధ్వర్యంలో సభ్యులు మున్సిపల్ కమిషనర్ కె.ఫల్గుణ్‌కుమార్‌ను కో రారు. ఈమేరకు శుక్రవారం మున్సిపల్ ఆఫీసులో ఆయనను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వంశీ మాట్లాడుతూ.. తమ టౌన్‌షిప్‌లో ఉన్న సమస్యలను దశలవారీగా పరిష్కారానికి కమిషనర్ హామీ ఇచ్చారని తెలిపారు.

ఆన్‌లైన్‌లో ఎంట్రీ మొదలు



ఆన్‌లైన్ ఎంట్రీని పరిశీలిస్తున్న కమిషనర్ శరత్‌చంద్ర

బండ్లగూడ: ప్రజాపాలనలో వచ్చిన దారఖాస్తులన్నీ ఆన్‌లైన్‌లో ఎంట్రీ చేస్తున్నట్లు బండ్లగూడ జాగీరు మున్సిపల్ కమిషనర్ బి.శరత్‌చంద్ర తెలిపారు. శుక్రవారం కార్పొరేషన్ కార్యాలయంలో చేపట్టిన ఆన్‌లైన్ ఎంట్రీని అధికారులతో కలిసి పరిశీలించారు.

స్పీకర్‌ను కలిసిన ఉద్యానవన విద్యార్థులు



ఏజీ వర్సిటీ: తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ జి.ప్రసాద్‌కుమార్‌ను శ్రీ కొండాలక్ష్మణ్ ఉద్యానవ వన విద్యార్థులు కలిసి తమ సమస్యలు వివరించారు. పదిహేనేళ్లుగా ఉద్యానవన అధికారి, సహాయ అధికారి పోస్టులు భర్తీ చేయలేదన్నారు. వర్సిటీలో చదువుకున్నా నిరుద్యోగులుగా ఉంటున్నామని, పోస్టులు త్వరగా భర్తీ చేయాలని స్పీకర్‌ని కోరారు.

చేవెళ్లలో బీజేపీ బలంగా ఉంది



సుదర్శన్ ప్రసాద్ తివారీ

రాజేంద్రనగర్: చేవేళ్ల పార్లమెంటు స్థానం నుంచి తనకు అవకాశం కల్పించాలని తెలంగాణ లింగ్విస్టిక్ డెవలప్‌మెంట్ ఫోరం చైర్మన్, బీజేపీ నాయకుడు సుదర్శన్ ప్రసాద్ తివారీ శుక్రవారం కేంద్ర మంత్రి, రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డిని కోరారు. ఈ సందర్భంగా తన వివరాలను కిషన్‌రెడ్డికి అందించారు. అనంతరం రాజేంద్రనగర్ ముష్క్ మహల్‌లోని తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. చెవేళ్ల పార్లమెంటు పరిధిలో అల్ప సంఖ్యాక వర్గాలు దాదాపు 5 లక్షల మంది ఉన్నారని చెప్పారు. గతంలో తాను రాజస్థాన్, చత్తీస్‌ఘడ్, బిహార్, బెంగాల్ తదితర రాష్ట్రాల్లో ఎన్నికల ఇన్‌చార్జిగా పనిచేసినట్లు తెలిపారు. చేవేళ్ల పార్లమెంటు పరిధిలో బీజేపీ బలంగా ఉందన్నారు. ఇదే విషయాన్ని రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డికి తెలిపినట్లు చెప్పారు.

దీపికకు అభినందనలు



రాజేంద్రనగర్: ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విద్యాలయంలో అగ్రికల్చర్ బీఎస్సీలో అడ్మిషన్ పొందిన ప్రభుత్వ జూనియర్ కాలేజీ విద్యార్థిని దీపికను అడిషనల్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీసు రష్మి పెరుమాళ్ అభినందించారు. దీపిక తల్లిదండ్రులు భవన నిర్మాణ కార్మికులు. జూనియర్ కాలేజీలో ఎన్‌సీసీ క్యాడెట్ కోటాలో ఆమె సీటు సాధించింది. కళాశాల ప్రిన్సిపాల్ ఎర్ర అంజయ్య దీపికను అభినందిచారు. ఈ సందర్భంగా కళాశాల సిబ్బంది మాన్య, స్వప్న, కిరణ్ కుమార్, చంద్రశేఖర్, కృష్ణారెడ్డి, మురళి, శ్రీజన్య, నవీన్, గోపికృష్ణా రెడ్డి, చంద్రశేఖర్, నర్సింగ్ శుభాకాంక్షలు తెలిపారు.

ఎంపీ రంజిత్‌రెడ్డికి సన్మానం



బండ్లగూడ: బండ్లగూడ జాగీరు బీఆర్ఎస్ నాయకులు తెలంగాణ భవన్‌లో శుక్రవారం జరిగిన చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గ సమీక్షా సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ రంజిత్‌రెడ్డితో పాటు ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌లను ఘనంగా సన్మానించారు. కార్పొరేషన్ మేయర్ మహేందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న గ్రామస్తులు



ఆలయ భూమిలో ఏర్పాటు చేసిన బ్లూషీట్ ప్రహరీ

ఆలయ భూమి కోసం..

- తహసీల్దార్‌కు ఖానాపూర్ వాసుల ఫిర్యాదు
- ప్రైవేటు వ్యక్తులు కబ్జా చేస్తున్నారని ఆందోళన

మణికొండ: హనుమాన్ ఆలయ భూమిని ప్రైవేటు వ్యక్తులు కబ్జా చేస్తున్నారని, దీన్ని అడ్డుకోవాలంటూ ఖానాపూర్ గ్రామస్తులు శుక్రవారం ఆందోళనకు దిగారు. వివరాలు.. నార్సింగి మున్సిపాలిటీ, ఖానాపూర్ రెవెన్యూ సర్వే నంబర్ 65లో హనుమాన్ ఆలయం ఉంది. దాని చుట్టూ ఉన్న భూమి కూడా గుడికి చెందినదే. ఇక్కడ జరిగే ఉత్సవాలకు ఆ స్థలంనే గ్రామస్తులు ఉపయోగిస్తున్నారు. ఇటీవల కొందరు ఆ స్థలంపై తమకు హక్కులు ఉన్నాయని ఆక్రమణలకు దిగారని గ్రామస్తులు చెబుతున్నారు. అంతేకాకుండా గురువారం రాత్రి భూమి చుట్టూ బ్లూషీట్‌లతో ప్రహరీ నిర్మాణం చేపట్టారు. దీంతో ఆంజనేయస్వామి ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పెద్ద ఎత్తున అక్కడకు చేరుకుని ఆందోళన చేట్టారు. గుడి భూమిని వారి పేరు మీద ధరణి పోర్టల్‌లో రికార్డు చేయించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సదరు స్థలంపై ఇప్పటి వరకు ఎవరికీ ఎలాంటి హక్కులు లేవని గుర్తుచేశారు.

తహసీల్దార్‌కు ఫిర్యాదు

ఖానాపూర్ సర్వే నంబర్ 65లో ఉన్న హనుమాన్ ఆలయ స్థలం ఎప్పటి నుంచో ప్రభుత్వ భూమిగా రికార్డులో ఉందని గ్రామస్తులు చెప్పారు. సదరు భూమిని రక్షించాలని కోరుతూ తహసీల్దార్ గోవర్ధన్‌ను శుక్రవారం కలిసి ఫిర్యాదు చేశారు. అక్కడ ఏర్పాటు చేసిన బ్లూషీట్‌లను వెంటనే తొలగించాలని కోరారు. తహసీల్దార్‌ని కలిసిన వారిలో కౌన్సిలర్ జి.అమరేందర్‌రెడ్డి, బీజేపీ ఓబీసీ మోర్చ జిల్లా అధ్యక్షుడు డి.లక్ష్మీనారాయణ, నార్సింగి మున్సిపాలిటీ బీజేపీ అధ్యక్షుడు సీహెచ్ భిక్షపతి యాదవ్, పీఏసీఎస్ చైర్మెన్ టి.కృష్ణ, ఆర్ఎస్ఎస్ నాయకుడు సురేశ్, విఠలయ్య, వెంకటేశ్, విఠల్‌రెడ్డి ఉన్నారు.

ప్రజాపాలన కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్



మణికొండలో లబ్ధిదారుడి నుంచి దరఖాస్తు తీసుకుంటున్న కలెక్టర్ శశాంక



నార్సింగిలో డాటా ఎంట్రీ విధానాన్ని తనిఖీ చేస్తున్న అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్

మణికొండ: మర్రిచెట్టు కూడలిలో కొనసాగుతున్న ప్రజాపాలన దరఖాస్తు కేంద్రాన్ని కలెక్టర్ శశాంక, అదనపు కలెక్టర్ ప్రతిమసింగ్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి వస్తున్న దరఖాస్తులను ఆన్‌లైన్ చేస్తున్న పద్ధతిపై మున్సిపల్ కమిషనర్ ఫల్గుణ్‌కుమార్, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. శనివారం సాయంత్రం వరకు వచ్చిన దరఖాస్తులను తీసుకోవాలని ఆదేశించారు. కేంద్రాల నిర్వహణ, సౌకర్యాలపై దరఖాస్తుదాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మణికొండ మున్సిపల్ చైర్మెన్ కె.నరేందర్‌ముదిరాజ్, వైస్ చైర్మెన్ కె. నరేందర్ రెడ్డి, కౌన్సిలర్ కె.లక్ష్మినారాయణ, కోఆప్షన్ సభ్యుడు తాజుద్దీన్, డీఈ దివ్యజ్యోతి, ఏఈ సాయిమౌనిక, నాయకులు కిరణ్‌కుమార్, రవికాంత్‌రెడ్డి ఉన్నారు.

నార్సింగిలో..

ప్రజాపాలన దరఖాస్తుల కార్యక్రమాన్ని జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ శుక్రవారం నార్సింగిలో పరిశీలించారు. కార్యక్రమంలో నార్సింగి మున్సిపల్ కమిషనర్ బి.సురేందర్‌రెడ్డి, డీఈ నరసింహరాజు, మేనేజర్ యోగేశ్, సిబ్బంది ఉన్నారు.

కార్యక్రమం పరిశీలన

శంషాబాద్ రూరల్: మండలంలోని పెద్ద గోల్కొండలో కొనసాగుతున్న ప్రజాపాలన కార్యక్రమాన్ని కలెక్టర్ కె.శశాంక శుక్రవారం పరిశీలించారు. ప్రజల నుంచి వస్తున్న దరఖాస్తుల విషయమై అధికారులతో చర్చించారు. అర్జీలను ఎప్పటికప్పుడు రిజిస్టర్‌లో నమోదు చేయాలని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్, ఎంపీడీఓ వసంతలక్ష్మి, ఎంపీఓ ఉషాకిరణ్ ఉన్నారు.

ప్రజాపాలన దరఖాస్తులు అందజేత

బండ్లగూడ: అర్హులంతా ప్రజాపాలన పథకానికి దరఖాస్తు చేసుకోవాలని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ నాయకుడు అస్లాం అన్నారు. ఈమేరకు పీఅండ్‌టీ కాలనీలో అధికారులకు దరఖాస్తులు అందించారు. ఆయన వెంట కాలనీ సోషల్ వర్క్ అసోసియేషన్ ప్రెసిడెంట్ సయ్యద్ ఫిరాసత్ హుస్సేన్, నదీమ్, జనరల్ సెక్రటరీ హఫీజ్‌ఖాన్, సయ్యద్ కుతుబుద్దీన్, జుబేర్ రజాక్, మిస్బావుద్దీన్, ఉస్మాన్ ఉన్నారు.



పీఅండ్‌టీ కాలనీలో దరఖాస్తులు అందిస్తున్న ప్రజలు

పేదల కాలనీకి త్వరలో తాగునీరు



పైప్‌లైన్ పనులను పరిశీలిస్తున్న కౌన్సిలర్

మణికొండ: నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని గిరిగిరిగడ్డ కాలనీలో పేదలకు త్వరలోనే తాగునీరు అందిస్తామని కౌన్సిలర్ శ్రీకాంత్‌రావు చెప్పారు. కాలనీలో రూ.52 లక్షల నిధులతో కొనసాగుతున్న పైప్‌లైన్ పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్‌రావు మాట్లాడుతూ.. గిరిగిరిగడ్డ కాలనీ నార్సింగికి దూరంగా ఉందని, ఇక్కడి పేదలు పడుతున్న తాగునీటి ఇబ్బందులపై పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేశామన్నారు. ఇటీవల నిధులు విడుదల కావడంతో శుక్రవారం నుంచి పనులు ప్రారంభమయ్యాయని చెప్పారు. కౌన్సిలర్ వెంట రాజేశ్‌యాదవ్ ఉన్నారు.

హుడా కాలనీ సమస్యలు పరిష్కరిస్తాం



ఓపెన్ జిమ్‌ను పరిశీలిస్తున్న నరేందర్‌రెడ్డి

మణికొండ: హుడా కాలనీలో సమస్యలను పరిష్కరిస్తామని మణికొండ మున్సిపల్ వైస్ చైర్మన్ కె.నరేందర్‌రెడ్డి అన్నారు. కాలనీలోని సర్దార్ వల్లభాయ్ పటేల్ పార్కులోని ఓపెన్ జిమ్‌లోని కొన్ని పరికరాలు పాడయ్యాయని, రహదారులు మరమ్మత్తులు చేయాలని గతంలో కాలనీ వాసులు ఆయన దృష్టికి తెచ్చారు. దీంతో నరేందర్‌రెడ్డి శుక్రవారం కాలనీలో పర్యటించి సమస్యలు తెలుసుకొని, అధికారులతో మాట్లాడారు. నరేందర్‌రెడ్డి వెంట మాజీ ఎంపీటీసీ సభ్యుడు ఎం. రాఘవరెడ్డి, కాలనీ సంక్షేమ సంఘం సంయుక్త కార్యదర్శి కృష్ణకుమార్, సభ్యులు సుగుణ రాజు, టి.రమేశ్‌బాబు ఉన్నారు.

అభివృద్ధి పనుల కోసం నిధులు మంజూరు



సమావేశంలో పాల్గొన్న మహేందర్‌గౌడ్ తదితరులు

బండ్లగూడ: మున్సిపల్ కార్పొరేషన్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నట్లు మేయర్ బుర్ర మహేందర్‌గౌడ్ అన్నారు. మేయర్ అధ్యక్షతన శుక్రవారం కార్పొరేషన్ కార్యాలయంలో సాధారణ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. సీసీ రోడ్ల ప్యాచ్ వర్క్స్, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్వహణ, హైమాస్ట్ లైట్ల రిపేర్లు, వీధి దీపాలు తదితరాలపై చర్చించారు. ఈ మేరకు రూ.142.40 లక్షల నిధులు కేటాయించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా అభివృద్ధి పనులు చేయాలని సూచించారు. కార్పొరేషన్ పరిధిలోని అన్ని డివిజన్లను అభివృద్ధి చేసేందుకు ఎప్పటికప్పుడు నిధులు మంజూరు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో కమిషనర్ బి.శరత్‌చంద్ర, కార్పొరేటర్లు, కోఆప్షన్ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

నేడు కరెంటు ఉండని ప్రాంతాలు

బండ్లగూడ: హిమాయత్‌సాగర్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని బండ్లగూడ జాగీరు, పీరం చెరువు పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి 12.30 గంటల వరకు పీరం చెరువు, వాసవీ ఆనంది, గిరచారీ అపార్ట్‌మెంట్ తదితర ప్రాంతాలలో మరమ్మత్తుల కారణంగా కోత విధిస్తున్నామన్నారు.

రేపు ఉచిత వైద్య శిబిరం

మణికొండ: నూతన ప్రభుత్వ ప్రైమరీ స్కూల్‌లో రేపు(ఆదివారం) వైద్య శిబిరం ఉంటుందని వీఆర్ ఫర్ సహయోగ్ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు చెప్పారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఈ మెగా హెల్త్ క్యాంప్ కొనసాగుతుందని, ఉచిత కన్సల్టేషన్‌తో పాటు, మందులు ఫ్రీగా ఇస్తామని చెప్పారు.

శంషాబాద్‌కు కొత్త ఎస్‌హెచ్‌ఓ



శ్రీనాథ్‌కు శుభాకాంక్షలు చెబుతున్న శ్రీధర్‌కుమార్

శంషాబాద్ రూరల్: శంషాబాద్ ఇన్‌స్పెక్టర్‌గా ఎస్.శ్రీనాథ్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. దాదాపు 22 నెలలుగా ఇక్కడ విధులు నిర్వహించిన ఎ.శ్రీధర్‌కుమార్ బదిలీపై ఆర్థిక నేరాల విభాగానికి వెళ్తుండగా ఆయన స్థానంలో శ్రీనాథ్ వచ్చారు.

రాజేంద్రనగర్ డీసీపీగా 'చింతమనేని'



డీసీపీ శ్రీనివాస్‌తో సర్కిల్ నాయకులు

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ డీసీపీగా చింతమనేని శ్రీనివాస్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. మహేశ్వరం జోన్ డీసీపీగా ఉన్న ఆయనను రాజేంద్రనగర్ డివిజన్‌కు బదిలీ అయ్యారు. డీసీపీ శ్రీనివాస్ గతంలో రాజేంద్రనగర్ ఇన్‌స్పెక్టర్‌గా, శంషాబాద్ ఏసీపీగా పనిచేశారు. ఈ సంద్భంగా వివిధ పార్టీల నాయకులు, స్థానికులు డీసీపీని సన్మానించారు.

శబరిమలకు బయలుదేరిన స్వాములు

రాజేంద్రనగర్: గాంధీనగర్‌కు చెందిన అయ్యప్ప స్వాములు శుక్రవారం మధ్యాహ్నం శబరిమలకు తరలివెళ్లారు. సత్యనారాయణ గురుస్వామి ఆధ్వర్యంలో స్వాములు ఇరుముడులు ధరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన పూజలో అయ్యప్ప స్వాములతో పాటు స్థానికులు పాల్గొన్నారు.

గుండెపోటుతో బల్గేరియా వాసి మృతి

శంషాబాద్: గుండెపోటుతో తాను బస చేసిన హోటల్లోనే విదేశీయుడు మృతి చెందిన సంఘటన ఆర్‌జీఐఏ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. సీఐ బాలరాజు తెలిపిన వివరాలు.. నందిగామలోని కన్హా శాంతి వనంలో పదిహేను రోజుల ధ్యానం కోసం బల్గేరియాకు చెందిన సరమోవ్ సెర్గీ జెలెవ్(78), తన భార్య సరమోవ్ అంటోటా(70) ఈ నెల 4న వచ్చారు. శంషాబాద్‌లో ఉన్న సామ ఎన్‌క్లేవ్‌లోని బ్లూ పెటల్ హోటల్‌లో బస చేశారు. శుక్రవారం ఉదయం 6 గంటలకు శాంతివనం బస్సు హోటల్ వద్దకు వచ్చినప్పటికీ దంపతులు వెళ్లలేదు. గంట తర్వాత హోటల్ గది నుంచి సహాయం చేయాలంటూ అరుపులు వినబడటంతో హోటల్ సిబ్బంది వెళ్లారు. స్పృహ కోల్పోయిన సెర్గీని ఆర్యాన్ ఆస్పత్రికి తరలించారు. అయితే, అప్పటికే అతను గుండెపోటుతో మృతి చెందినట్లు వైద్యులు చెప్పారు. ఆర్‌జీఐఏ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఒక్క రోజే 12 వేల దరఖాస్తులు

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని ఐదు డివిజన్లలో ఏర్పాటు చేసిన ప్రజా పాలన అభయహస్తం కౌంటర్ల ద్వారా శుక్రవారం 12,066 దరఖాస్తులను స్వీకరించినట్లు డిప్యూటీ కమిషనర్ రవి కుమార్ తెలిపారు. 8,039 దరఖాస్తులు ఆరు పథకాల కోసం దరఖాస్తు చేసుకున్నారన్నారు. రేషన్ కార్డుతో పాటు ఇతర వాటి కోసం 4,027 మంది తమ దరఖాస్తులను అందించారన్నారు. శనివారం దరఖాస్తుల స్వీకరణకు చివరి రోజు కావడంతో సిబ్బందిని అప్రమత్తం చేసినట్లు తెలిపారు. మరింత మంది లబ్ధిదారులు దరఖాస్తు చేసుకునేందుకు కౌంటర్లకు తరలివస్తారని.. అందుకనుగుణంగా ఏర్పాట్లు చేపడుతున్నట్లు తెలిపారు. శనివారం సాయంత్రం 5.30 గంటల వరకు కౌంటర్లు కొనసాగుతాయన్నారు.

అలకాపూర్‌లో నేడు ముగ్గుల పోటీలు



ఎమ్మెల్యేను కలిసిన క్లబ్ సభ్యులు

మణికొండ: వాసవి కపుల్స్ క్లబ్ ఆధ్వర్యంలో అలకాపూర్ టౌన్‌షిప్‌లోని నేతాజీ పార్కులో ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నామని క్లబ్ అధ్యక్షుడు వంశీకృష్ణ తెలిపారు. ఈమేరకు ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్‌ను శుక్రవారం కలిసి ఆహ్వానించారు. అనంతరం వంశీకృష్ణ మాట్లాడుతూ.. ప్రతి ఏడాదిలానే సంక్రాంతిని పురస్కరించుకొని మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నామని చెప్పారు. నేడు(శనివారం) ఉదయం 9 గంటల నుంచి 11 వరకు జరిగే కార్యక్రమంలో ఎమ్మెల్యే చేతుల మీదుగా బహుమతుల ప్రదానం ఉంటుందన్నారు. ఎమ్మెల్యేని కలిసిన వారిలో క్లబ్ ప్రధాన కార్యదర్శి యశ్వంత్, రిజినల్ కోఆర్డినేటర్ నవీన్‌కుమార్, ఈసీ సభ్యులు నాగరాజు ఉన్నారు.

శ్రీరాముని పవిత్ర అక్షింతల పంపిణీ



మణికొండ: అయోధ్య శ్రీరాముని ఆలయం నుంచి వచ్చిన పవిత్ర అక్షింతలను ప్రతి ఒక్కరూ తీసుకోవాలని మణికొండ మున్సిపల్ వైస్ చైర్మన్ కె.నరేందర్‌రెడ్డి, బీజేపీ మున్సిపల్ అధ్యక్షుడు సి.బీరప్ప కోరారు. శుక్రవారం లక్ష్మీనగర్ కాలనీలో ఇంటింటికీ శ్రీరాముని అక్షింతలు పంపిణీ చేశారు. ఈ నెల 22న శ్రీరాముని విగ్రహ ప్రతిష్టాపన జరుగుతుండటంతో ఆ రోజు ప్రతి ఇంట్లో ఐదు దీపాలు వెలిగించాలని సూచించారు. మాజీ ఎంపీటీసీ సభ్యుడు ఎం.రాఘవరెడ్డి, మల్లికార్జున్, నరసయ్య చారి, నర్సింగ్‌రావు, సుధాకర్‌గౌడ్, బి.ఇందిర, రంగనాయకమ్మ పాల్గొన్నారు.

ట్రాఫిక్ నియమాలు పాటించాలి



వాహనాల తనిఖీ చేస్తున్న సీఐ

బండ్లగూడ: ప్రజలు ట్రాఫిక్ నియమాలు పాటించాలని నార్సింగి ట్రాఫిక్ సీఐ కృష్ణ సూచించారు. బండ్లగూడ జాగీరులోని కాళికానగర్‌లో శనివారం వాహనాల తనిఖీలు నిర్వహించారు. అనంతరం సీఐ మాట్లాడుతూ.. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలను నడిపితే జరిమానాతో పాటు జైలు శిక్ష పడుతుందని చెప్పారు.

కాంట్రాక్టు కార్మికుల వినతి



ప్రజావాణిలో వినతిపత్రం ఇస్తున్న కార్మికులు

శంషాబాద్: మున్సిపల్ కాంట్రాక్టు కార్మికులను క్రమబద్ధీకరించాలని కోరుతూ శుక్రవారం జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో వినతిపత్రం అందించారు. కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనం రూ.25 చెల్లించడంతో పాటు శాశ్వత ఉద్యోగులుగా పరిగణలోకి తీసుకోవాలని కోరారు. వినతిపత్రం అందించిన వారిలో కార్మిక సంఘం నాయకులు డి.నగేశ్, డి.యాదగిరి, సంజీవ, ఖదీర్, మహేశ్ ఉన్నారు.

ఆస్తులు ఎవరికీ ఇవ్వలేదు

మణికొండ: తన కుమారుడి ఆస్తిని సొంత కూతుర్లకే ఇచ్చానని, తన కోడలు చేస్తున్న ఆరోపణల్లో నిజం లేదని మణికొండ శివాజీనగర్ కాలనీకి చెందిన యాదమ్మ చెప్పారు. శుక్రవారం ఆమె 'సాక్షి'తో మాట్లాడుతూ.. తన కుమారుడు ధన్‌రాజ్ అనారోగ్యంతో ఉన్నపుడు లక్షల్లో అప్పులు చేశాన్నారు. తనకి చెప్పకుండానే ఓ ఇంటిని కోడలు సుధారాణి తన పేరుపై మార్చుకుందని తెలిపారు. ఆపై ఆ ఇంటి నుంచి వెళ్లిపోవాలని వేధింపులకు గురిచేయటంతో ఆరేళ్లుగా కూతురు వద్ద ఉంటున్నానని యాదమ్మ చెప్పారు. సుధారాణి చేసే ఆరోపణలు అబద్ధాలని, ఈ విషయం కాలనీవాసులతో పాటు గ్రామ పెద్దలకు తెలుసన్నారు. ఆమెకు ఇప్పటికే ఇళ్లు, ఖాళీ స్థలం, బంగారం, ఉద్యోగం సమకూర్చానని యాదమ్మ చెబుతున్నారు.

గుర్తుతెలియని యువతి మృతదేహం లభ్యం



శంషాబాద్: ఆర్‌జీఐఏ పోలీస్‌స్టేషన్ పరిధిలో గుర్తుతెలియని యువతి మృతదేహం లభ్యమైంది. ఎయిర్‌పోర్టు బావర్చీ హోటల్ ఎదురుగా ఫ్లైఓవర్ కింద యువతి మృతదేహం పడి ఉండటం గుర్తించిన స్థానికులు 100 డయల్‌కు సమాచారం అందించారు. దీంతో ఆర్‌జీఐఏ పోలీసులకు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. యువతి వయస్సు సుమారు 21 సంవత్సరాలు ఉంటాయని, యాచకురాలై ఉంటుందని అనుమానిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియాకు తరలించారు.

చెట్టుకు ఉరి వేసుకున్న యువకుడు

శంషాబాద్ రూరల్: గుర్తు తెలియని యువకుడు(22) గండిగూడ శివారులో జాతీయ రహదారి పక్కన ఓ చెట్టుకు ఉరివేసుకున్నాడు. శుక్రవారం రాత్రి గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేశారు.

బెల్టుషాపులో మద్యం పట్టివేత

శంషాబాద్ రూరల్: బెల్టుషాపులో అమ్మకానికి పెట్టిన మద్యాన్ని పోలీసులు సీజ్ చేశారు. ఇన్‌స్పెక్టర్ ఎస్.శ్రీనాథ్ తెలిపిన వివరాల ప్రకారం.. ననాజీపూర్‌లో ఉన్న లక్ష్మీనర్సింహా కిరాణా దుకాణంలో మద్యం విక్రయిస్తున్నట్లు శుక్రవారం పోలీసులకు సమాచారం అందింది. దీంతో ఎస్ఐ భాస్కర్‌రావు సిబ్బందితో కలిసి షాపులో తనిఖీ చేశారు. అక్కడ బీరు, మద్యం బాటిళ్లు లభించడంతో వాటిని సీజ్ చేశారు.

కూరగాయల కోసం వెళ్లి అదృశ్యం



కావేరి

శంషాబాద్ రూరల్: కూరగాయల కోసం వెళ్లిన యువతి అదృశ్యమైంది. ఇన్‌స్పెక్టర్ ఎస్.శ్రీనాథ్ తెలిపిన వివరాలు.. మండలంలోని శంకరాపురం నివాసి కద్దాల కావేరి(19) ఈ నెల 4న ఉదయం కూరగాయల కోసం శంషాబాద్ మార్కెట్ వెళ్లింది. ఎంత సేపటికీ ఆమె తిరిగి రాకపోవడంతో అన్ని చోట్ల వెతికినా ఫలితం లేదు. దీంతో శుక్రవారం కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.